క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.20 వేల విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న దాత అచ్చింనాయుడు

కె.కోటపాడు: కొరువాడ జగన్నాథపురంలో వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణానికి డేన్ ఫౌండేషన్ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు సోమవారం రూ.20 వేల విరాళం అందజేశారు. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని ఆయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గంగరాజు, గుంపాన రమేష్, గంగునాయుడు, ఆవాల స్వామి, పల్లా సన్యాసినాయుడు, అప్పలనాయుడు, పైడిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: తామరంలో జల్ జీవన్ మిషన్ పథకం నుంచి రూ.14 లక్షలతో చేపట్టే పైపులైన్ పనులను ఎంపీపీ రుత్తల సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం సచివాలయంలోని కౌలు రైతు అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ నెలాఖరులోగా కౌలు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నేతలు హరిబాబు, భద్రాచలం, ఏవో చిరంజీవి పాల్గొన్నారు.

ఎరుకువాడలో రోడ్డు పనులు ప్రారంభం



రహదారి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కామలక్ష్మి

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం పంచాయతీ శివారు ఎరుకువాడలో శ్మశాన వాటికకు వైపు రహదారి పనులను సర్పంచ్ వెలగాడ కామలక్ష్మిఈశ్వరరావు టెంకాయ కొట్టి సోమవారం ప్రారంభించారు. ఇటీవల 'గడప గడపకు' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు విన్నవించామన్నారు. ఈ మేరకు ఉపాధి హామీ నిధులు మంజూరు చేశారన్నారు. వార్డు సభ్యురాలు అప్పయ్యమ్మ, నాయకులు తాటికొండ శ్రీరామూర్తి, కోన తాతయ్యలు, పినపల్లి సంజీవిరావు, సీనియర్ మేట్ గణేష్ పాల్గొన్నారు.

'నేను టీడీపీలో చేరలేదు'



మాట్లాడుతున్న సత్యనారాయణ

రోలుగుంట: తనను మభ్యపెట్టి తెలుగుదేశం పార్టీ వారు కండువా వేశారని, తాను పార్టీ మారలేదని పడాలపాలెం పంచాయతీ శివారు లగుడు కొత్తూరు వార్డు మెంబర్ లగుడు సత్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం కొన్ని పత్రికల్లో (సాక్షిలో కాదు) తాను టీడీపీలో చేరినట్టు వచ్చిన వార్తలు చూసి బాధేసిందన్నారు. తొలి నుంచి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ వెంటే ఉన్నానని, రాబోవు ఎన్నికల్లోనూ ఆయన వెంటే నడుస్తానని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జె.నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ నక్కా రమణ పాల్గొన్నారు.

పాల సంఘం డైరెక్టర్ల ఎన్నిక



మాట్లాడుతున్న డెయిరీ డైరెక్టర్ గంగాధర్

కె.కోటపాడు: పాల సంఘం అధ్యక్షుడు కె. వెంకటరమణ ఆధ్వర్యంలో చౌడువాడలో సంఘం నూతన డైరెక్టర్లుగా గొలగాని నాగేష్, శిలపరశెట్టి వెంకటరావులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల మరణించిన సభ్య రైతుల కుటుంబాలకు బీమా చెక్కులను విశాఖ డెయిరీ డైరెక్టర్ గంగాధర్ అందజేశారు.

రెండు నెలల్లో గుడివాడకు బీటీరోడ్డు

- శంకుస్థాపన చేసిన విప్ ధర్మశ్రీ



రావికమతం: బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ధర్మశ్రీ, డీఈ మోహన్



బుచ్చెయ్యపేట: ఐయితంపూడి రోడ్డుకు శంకుస్థాపన చేసిన విప్ ధర్మశ్రీ

రావికమతం: గుడివాడ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల్లో బీటీరోడ్డు వేసి తీరుతామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆర్‌ఈసీ రహదారి నుంచి గుడివాడ వరకూ రూ.1.16 కోట్లతో చేపట్టే బీటీరోడ్డు పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు గ్రామాలకు బీటీరోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రెండు రోజుల్లో మత్రివలస–గొల్లలపాలెం రహదారి పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. గుడివాడ రహదారిలో చేపడుతున్న కల్వర్టుల నిర్మాణం నాణ్యతలో రాజీ పడవద్దని పీఆర్ ప్రాజెక్ట్స్ డీఈ మోహన్‌కు సూచించారు. గ్రామంలో ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి గాయాల పాలైన వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్నం రమణబాబును పరామర్శించారు. ఎంపీపీ పైల రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ కర్నం అప్పారావు, నాయకుడు గుడివాడ నాయుడు పాల్గొన్నారు.

ఐయితంపూడి తారురోడ్డు పనులకు శంకుస్థాపన

బుచ్చెయ్యపేట: ఐయితంపూడిలో తారు రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. గత టీడీపీ హయాంలో గ్రామానికి తారు రోడ్డు వేస్తామని అప్పటి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, టీడీపీ నాయకులు శిలాఫలకం వేసి వదిలేశారు. దాంతో మట్టి రోడ్డుతో గ్రామస్తులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పెద్ద గోతులు పడి వర్షాకాలంలో బురదలో వాహనాలు కూరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవల రూ.25 లక్షలతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేశారు. ఇప్పుడు రూ.75 లక్షలతో బుచ్చెయ్యపేట రోడ్డు నుంచి ఐయితంపూడి వరకు కిలోమీటరు మేర తారురోడ్డు వేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తమ గ్రామానికి తారురోడ్డు వస్తోందని సర్పంచ్ పెద్దాడ నాయుడు, చోడవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ముచ్చకర్ల వెంకటరావు, సచివాలయ కన్వీనర్ అయితరెడ్డి రమణ, పాల కేంద్రం సెక్రటరీ ఐయితరెడ్డి శ్రీనివాస్, నాయకులు ఐయితరెడ్డి చినబాబు, మహాలక్ష్మినాయుడు, శ్రీను ఆనందం వ్యక్తం చేశారు. విప్ ధర్మశ్రీని ఘనంగా సత్కరించారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు.

కొండెంపూడి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కొళ్లిమల్లపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: కొండెంపూడి శివారు కొళ్లిమల్లపాలెంకు తారురోడ్డు ఏర్పాటు చేసి గ్రామస్తులకు రవాణా సదుపాయం కల్పిస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం పాత కొండెంపూడి, కొత్త కొండెంపూడి, ఐయ్యరకలపాలెం, కొళ్లిమల్లపాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మండల నాయకులు, అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ లబ్ధి, ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుందని, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల ఏర్పాటుతో స్థానికంగానే అన్ని రకాల సేవలు అందుతున్నాయని నాలుగు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా తమ గ్రామానికి రవాణా సదుపాయం లేదని కొళ్లిమల్లపాలెం గ్రామస్తులు విప్ ధర్మశ్రీ వద్ద వాపోయారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు సమస్యను పరిష్కరించామని, రైతులు, సర్పంచ్ ఆది సత్తిబాబు సహకారంతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయించానని విప్ ధర్మశ్రీ తెలిపారు. త్వరలోనే తారురోడ్డు ఏర్పాటు చేస్తానన్నారు. కొత్త కొండెంపూడిలో రూ.10 లక్షలతో డ్రైనేజీలు ఏర్పాటు చేస్తానన్నారు. కొత్త కొండెంపూడిలో ఆది నమ్మయ్యదొర ఇంటి నుంచి ఎర్రిగెడ్డ వరకు డ్రైనేజీతోపాటు ఎర్రిగెడ్డపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. వీటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పాత, కొత్త కొండెంపూడి గ్రామాలకు తారురోడ్డు ఏర్పాటుతోపాటు కొండెంపూడి పంచాయతీలో నాలుగు గ్రామాలకు రూ.1.25 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి మూణ్నెల్లలో తాగునీరు అందిస్తామన్నారు. కొండెంపూడి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, మాజీ సర్పంచ్ ఆది సూర్య ప్రకాష్, పాల సంఘం అధ్యక్షుడు దొండా శ్రీను, రవి పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలు కుష్టుకు సంకేతాలు



గుల్లేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రాజు

కె.కోటపాడు: శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉన్నట్లయితే, వాటిని కుష్టు వ్యాధికి సంకేతాలుగా గుర్తించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. కుష్టు వ్యాధి పక్షోత్సవాలలో భాగంగా సోమవారం గుల్లేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ఎండీటీ మందుల ద్వారా వ్యాధిని అదుపులో ఉంచడం సాధ్యమని ఆయన తెలిపారు. చేతితో వస్తువులను పట్టుకునే సమయంలో చేతికి స్పర్శ లేక పోవడంతోపాటు వేడిని, చల్లదనాన్ని గ్రహించకపోవడాన్ని వ్యాధి లక్షణాలుగా పరిగణించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే ప్రారంభం

మాకవరపాలెం: లెప్రసీ నివారణే లక్ష్యంగా చేపట్టిన సర్వే ప్రారంభమైంది. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది సోమవారం సర్వే ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి లెప్రసీ లక్షణాలపై ఆరా తీశారు. అనుమానితుల పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ వివరాలను వైద్యులకు అందజేయనున్నట్టు సీహెచ్‌వో రమేష్ తెలిపారు. సర్వే పక్కాగా చేయాలని వైద్యాధికారులు శ్రీవిద్య, చరణ్ సిబ్బందిని ఆదేశించారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

- జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

నర్సీపట్నం: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ హెచ్చరించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్, మానవ అక్రమ రవాణాపై పట్టణంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి జడ్జి మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, అమ్మటం చట్టరీత్యా నేరమన్నారు. వీటికి దూరంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలు, అమ్మాయిలను వేరే ప్రాంతాలకు తరలించి బంధించిన వారు శిక్షార్హులు అవుతారన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు, న్యాయవాది అనిమిరెడ్డి గోవింద్ పాల్గొన్నారు.

రోలుగుంట: బుచ్చింపేట పీహెచ్‌సీ వద్ద సోమవారం మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిరోధక కార్యక్రమాన్ని చైల్డ్‌ఫండ్ లింక్ వర్కర్ ప్రతినిధి మలసాల గణేష్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై ఇక్కడ వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు.

గొలుగొండ: యువత చెడు వ్యసనాలకు బానిసకావద్దని గొలుగొండ ఎస్‌ఈబీ సీఐ రాజారావు తెలిపారు. డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా జోగుంపేట నుంచి గొలుగొండ వరకు విద్యార్థులతో కలిసి ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారంలో సీఐ మాట్లాడారు. ఎస్ఐ గిరితోపాటు జోగుంపేట జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందేలా..

నాతవరం: రెవెన్యూ పరమైన సమస్యలను సకాలంలో పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా సేవలందించాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్ నాయుడును వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను సోమవారం ఎంపీపీ లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్సల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పలు ప్రధానమైన సమస్యలను తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు.

శ్రీనివాసరావు మృతికి సంతాపం

మాడుగుల రూరల్: వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు బేతా శ్రీనివాసరావు(51) అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. జి. అగ్రహారం గ్రామానికి చెందిన ఆయన వీవోఏగా పనిచేస్తున్నాడు. ఏపీఎం అప్పలనర్సమ్మ, సీసీలు, వీవోఏలు సోమవారం జి. అగ్రహారంలో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ అప్పలనర్స

నాతవరం: రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స అన్నారు. స్థానిక ఆర్బీకేలో సోమవారం వరి విత్తనాలు రైతులకు వారు పంపిణీ చేశారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఆమోదం ఉన్న రైతులకు విత్తనాలు ఇచ్చేవారన్నారు. ఇప్పుడు రైతులకు కావలసిన విత్తనాలను మండలంలోని 16 ఆర్బీకేల్లో పంపిణీ చేస్తున్నామన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ శెట్టి నూకరాజు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, సర్పంచులు లోకారపు రాము, ఇట్టంశెట్టి శ్రీను, సీనియర్ నాయుకులు వేముల సూరిబాబు, గుడపర్తి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. తామరం రైతు భరోసా కేంద్రంలో సోమవారం రాయితీ వరి విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో చిరంజీవి మాట్లాడుతూ మండలానికి 80 టన్నుల విత్తనాలు మంజూరయ్యాయని, వీటిని 15 ఆర్బీకేల్లో పంపిణీ చేస్తామన్నారు. తూర్పు కాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ ద్వారపురెడ్డి అయ్యన్న, వైఎస్సార్‌సీపీ నేతలు పెట్ల భద్రాచలం, బొడ్డు గోవిందరావు, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, సర్పంచ్ చెల్లారత్నం పాల్గొన్నారు.

పరశురామ, శ్రీరాముని అవతారాల్లో జగన్నాథుడు

చోడవరం/మాడుగుల: పరుశురామ, శ్రీరాముని అవతారాల్లో జగన్నాథస్వామి సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. చోడవరం కేశవస్వామి ఆలయంలోని మాడుగుల జగన్నాథ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టుబోర్డు చైర్మన్ అలమండ ఈశ్వరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, ఆలయ మాజీ చైర్మన్ ఉప్పలబాబు పాల్గొన్నారు. మాడుగుల ఇంద్రద్యుమ్నం వద్ద స్వామివారిని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, సర్పంచ్ ఎడ్ల కళావతి దర్శించుకున్నారు.

'జగనన్న సురక్ష'తో పేదలకు మేలు



మర్రిపాలెంలో సర్వే చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు



బోయిలకింతాడలో మాట్లాడుతున్న బాబూరావు, రమణ

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందరు బాధ్యతగా నిర్వర్తిస్తే ఆశించిన విధంగా పేదలకు మేలు కలుగుతుందని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం మర్రిపాలెంలో ఆయన, చమ్మచింతలో ఎంపీడీవో హనుమంతరావు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఇంతవరకు అందిన సంక్షేమ పథకాలు, ఇంకా అర్హత ఉండి ఏయే పథకాలు రావాల్లో అడిగి తెలుసుకున్నారు. సర్వేలో గుర్తించినవి వచ్చే నెల గ్రామసభలో నేరుగా ఇంటికే వలంటీర్లు ద్వారా అందజేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. మండలంలోని బోయిలకింతాడ, కలిగొట్ల గ్రామాల్లో సోమవారం వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ మాట్లాడుతూ అర్హత ఉండి ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కలిగొట్ల సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి, ఎంఎల్‌వో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రావికమతం: వలస వెళ్లిన వారిని రప్పించి వారికి న్యాయం చేసే గురుతర బాధ్యత తీసుకోవాలని మండల ఇన్‌చార్జి కంచిపాటి జగన్నాథరావు తెలిపారు. సోమవారం దొండపూడి సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు ఆయన అవగాహన కల్పించారు.

కె.కోటపాడు: సాంకేతిక కారణాలతో పథకాలను వర్తించని కుటుంబాలకు జగనన్న సురక్షతో లబ్ధి కలగనున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ అన్నారు. సోమవారం చౌడువాడలో వలంటీర్లతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఉచితంగా అందించనున్న 11 రకాల పౌరసేవలపై ప్రజలకు వివరించారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వంటర్లపాలెంలో మహిళతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం వంటర్లపాలెంలో ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు.జ సీసీరోడ్లు, డ్రైనేజీలు, భవనాల పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలు కలిగి వుండాలని, ఎక్కడా అసంపూర్తిగా వదిలేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.70 లక్షలతో 20 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల అదనపు వాటర్ ట్యాంకు నిర్మించి 400 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో జగనన్న ఇళ్లు నిర్మించుకున్న తొమ్మిది మంది లబ్ధిదారులకు ఉచిత కరెంటు మీటర్లు అందజేశారు. గ్రామానికి చెందిన తిమ్మాపాత్రుని ధనలక్ష్మి తన భర్త తొమ్మిదేళ్లుగా కనిపించకుండా పోయాడని వాపోయింది. రూరల్ సీఐ తాతారావును పిలిచి కేసు గురించి ఆరా తీశారు. రూ.2 వేలు అందజేశారు. దివ్యాంగురాలు లెక్కలు వెంకటలక్ష్మికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జగనన్న లేఅవుట్ స్థలం ఎత్తు చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ అల్లాడ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ గంగుపాం కనకరావు, ఉప సర్పంచ్ బొమ్మిశెట్టి వెంకటరమణ, నాయకులు అల్లాడ సూర్యారావు, కాటిపాము గోవిందరావు, కోరుకొండ చెల్లంనాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, కోట్ని శ్రీరామూర్తి, మళ్ల కన్నబాబు, కాళ్ల రాము, జామి రమణబాబు, యడ్ల కళావతి, బోగాది శంకరరావు, ఇల్లపు పిట్టనాయుడు, పెమ్మే శ్రీను, వెలగాడ ఈశ్వరరావు, దాడి రాజేశ్వరావు, కరణం రాము, జామి చిన్న, కాళ్ల అప్పలనాయుడు, కళ్యాణరాజు, ఎంపీడీవో మీనాకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, ఏఈలు లెక్కల సత్యనారాయణ, నర్సింగరావు, శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈఈ రమణ పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో సంక్షేమ లబ్ధి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 16వ వార్డు శారదనగర్‌లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కొన్నేళ్లుగా నిరాదారణకు గురైన రహదారులను రూ.20 లక్షలతో మోక్షం కల్పించడంతో వార్డు మహిళలు హారతులు పట్టి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రతి సచివాలయంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వెనువెంటనే ప్రయోజనం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరపల్లి నాని, చినబాబు, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనివాసరావు, అర్జున్‌వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.

దేవరాపల్లిని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతా

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి దేవరాపల్లిని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతానని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. దేవరాపల్లిలోని బీరక, రజక, నాయీ బ్రాహ్మణుల వీధుల్లో సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీరకవీధి విశ్వబ్రహ్మణ మందిరం వద్ద, చాకలి వీధి వద్ద అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డిప్యూటీ సీఎంకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణుల వీధి నుంచి సన్యాసమ్మ ఆలయానికి సీసీరోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. శారదానది నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు రూ.50 లక్షలతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సబ్బవరపు మాలిబాబు, గాలి సూర్యలక్ష్మి, వాలేటి నాగరాజు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు....

మాడుగుల: పది కాలాల పాటు భవనం ఉండేటట్లు నాణ్యతా ప్రమాణంలో రాజీపడకుండా నిర్మించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద రూ.90 లక్షలతో చేపట్టిన పీఆర్ గెస్ట్ హౌస్ నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి 'జగనన్న విద్యా కానుక'



మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు : విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే జగనన్న విద్యా కానుక కిట్లను అన్ని పాఠశాలల్లోనూ అందిస్తున్నామని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో సోమవారం ఆయన హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 3,091 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు ఇచ్చామన్నారు. బడి ఈడు పిల్లలు చదువుకునేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ప్రోత్సహించాలన్నారు.

నాతవరం: ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో సోమవారం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా విద్యా బోధనతోపాటు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరులో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతి పాఠశాలలో మెనూ విధిగా అమలు చేయాలన్నారు. రెండో విడత నాడు –నేడు పనులు వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ముందుగా నూతన ఎంఈవో–2 కామిరెడ్డి వరహాలబాబును పరిచయం చేశారు. పలు అంశాలపై నూతన ఎంఈవో మాట్లాడారు. సీఆర్పీలు పాల్గొన్నారు.